సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 10 । జనవరి । 2025

జగదాంబ జంక్షన్‌కు సం'క్రాంతి'

సంక్రాంతి పండక్కి నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనాలతో జగదాంబ జంక్షన్ గురువారం కిక్కిరిసిపోయింది.

ఫొటో : సాక్షి, ఫొటోగ్రాఫర్



న్యూస్‌రీల్

నితీష్‌కుమార్ రెడ్డికి ఘన స్వాగతం



నితీష్‌తో సెల్ఫీ తీసుకుంటున్న అభిమానులు

విశాఖస్పోర్ట్స్/గోపాలపట్నం : ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణించి అందరి దృష్టిని ఆకర్షించిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి స్వస్థలమైన విశాఖకు గురువారం చేరుకున్నాడు. విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ముంచెత్తారు. పలువురు అభిమానులు ఆటోగ్రాఫ్‌లు, ఫొటోలు తీసుకున్నారు. విమానాశ్రయం నుంచి ఓపెన్ టాప్ వాహనంలో ఇంటికి ర్యాలీగా వెళ్లారు. నితీష్ శనివారం అకాడమీలో శిక్షణకు వెళ్లనున్నాడు. ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20లు, వన్డే మ్యాచ్‌లకు ఎంపికయ్యే అవకాశం ఉంది.

20 కోచ్‌లతో వందేభారత్ ఎక్స్‌ప్రెస్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను 20 కోచ్‌లతో నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీ రోజు ఉదయం 5.45 గంటలకు బయల్దేరే విశాఖపట్నం–సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరే సికింద్రాబాద్– విశాఖపట్నం (20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 11వ తేదీ నుంచి 20 కోచ్‌లతో నడుస్తాయి. అప్పటినుంచి ఈ రైలు 18–చెయిర్‌కార్, 2–ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్‌లతో నడుస్తుంది. ప్రస్తుతం ఈ వందేభారత్ 16 కోచ్‌లతో నడుస్తుంది.


పండక్కి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగ వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక (జనసాధారణ్) రైళ్లు ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి(08533) జనసాధారణ్ స్పెషల్ విశాఖపట్నంలో ఈ నెల 10,12,15,17వ తేదీల్లో ఉదయం 9.45 గంటలకు బయల్దేరి రాత్రి 10.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి–విశాఖపట్నం (08534) జనసాధారణ్ స్పెషల్ ఈ నెల 11,13,16, 18వ తేదీల్లో మధ్యరాత్రి 12.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–చర్లపల్లి(08537) జనసాధారణ్ స్పెషల్ విశాఖలో ఈ నెల 10,11,15,16వ తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి–విశాఖపట్నం(08538) జనసాధారణ్ స్పెషల్ ఈనెల 11,12,16,17వ తేదీల్లో ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదే రోజు రాత్రి 10గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

11, 12న పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: దక్షిణ కోస్తా రైల్వే విజయవాడ డివిజన్ రేగుపాలెం–నరసింగపల్లి సెక్షన్ మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఈ నెల 11వ తేదీన రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈనెల 11న కాకినాడ–విశాఖపట్నం(17267) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–కాకినాడ(17268)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–పార్వతీపురం(08565) ఎక్స్‌ప్రెస్, పార్వతీపురం–విశాఖపట్నం (08566) ఎక్సప్రెస్, గుంటూరు–విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 12వ తేదీన విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



దాబాగార్డెన్స్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక సర్వీసులు ఈ నెల 13వ తేదీ వరకు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 20 బస్సులు, రాజమండ్రి, విజయవాడకు 40 సర్వీసులు, కాకినాడకు 20, విశాఖపట్నం నుంచి విజయనగరం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాసకు మొత్తంగా 830 బస్సులు నడపనున్నట్టు పేర్కొన్నారు.

అంతులేని విషాదం



ఇందిరానగర్‌లో ఫొటో పట్టుకుని రోదిస్తున్న శాంతి తల్లి, బంధువు



జీవీఎంసీ 55వ వార్డు, గాంధీనగర్‌కు చెందిన కండిపిల్లి శాంతి, ఆమె భర్త వెంకటేష్, కుమారుడు మహేంద్ర వరప్రసాద్ గోవింద మాలధారణ దీక్ష చేపట్టి, దీక్ష విరమణ కోసం తిరుపతి వెళ్లారు. ఈమె కూడా అక్కడ జరిగిన తొక్కిసలాటలో మృతి చెందారు. కుమారుడు వరప్రసాద్ రోదనలు కలచివేస్తున్నాయి. శాంతి మరణంతో గాంధీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శాంతి అందరితో మంచిగా ఉండేవారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. శాంతి తల్లి కిల్లాడి అప్పల నరసమ్మ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తన కూతురు మరణించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనలో నలుగురు ఉమ్మడి విశాఖవాసుల దుర్మరణం

ప్రభుత్వ నిర్లక్ష్యంపై మృతుల కుటుంబ సభ్యుల ఆగ్రహం

ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో కథ.. అంతులేని వ్యథ.. భగవంతుడి దర్శనంతో తమ జీవితాలు ధన్యమవుతాయని భావించిన వారి విధిని విధాత మరోలా రాశాడు. దైవ దర్శనానికి వెళ్లిన నలుగురు భక్తులు ఊహించని ప్రమాదంలో విగతజీవులుగా మారడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురిలో నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారుండటం దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యుల మృతితో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే.. ఆయా కాలనీల ప్రజల హృదయాలు బరువెక్కాయి. ఈ హృదయ విదారక సంఘటన భక్తుల భద్రతా ఏర్పాట్లపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ఈ దుర్ఘటన ప్రభుత్వం, టీటీడీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సీతంపేట/కంచరపాలెం/మద్దిలపాలెం/నర్సీపట్నం

మద్దిలపాలేనికి చెందిన గుడ్ల రజనీ(47), ఆమె భర్త లక్ష్మారెడ్డి వైకుంఠ ద్వార దర్శనం కోసం రెండు రోజుల కిందట తిరుపతి వెళ్లారు. టోకెన్ల జారీ సమయంలో జరిగిన ఘటనలో రజనీ మృతి చెందారు. లక్ష్మారెడ్డి ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ఎంఎస్ చదువు నిమిత్తం అమెరికాలో ఉన్నారు. కుమారుడి భవిష్యత్తు కోసం రజనీ నిత్యం వేంకటేశ్వర స్వామి, సాయిబాబాకు పూజలు చేసేవారని బంధువులు తెలిపారు. రజనీ పరమ భక్తురాలని, ఆమె ఇల్లు దేవాలయంలా ఉంటుందని బంధువు లక్ష్మి తెలిపారు. ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లిపోయావా అంటూ రజనీ తోటి కోడళ్లు బోరు విలపించారు. కుమారుడి భవిష్యత్‌ను చూడకుండా కన్నుమూసిందని కన్నీరు పెట్టుకుంటున్నారు. తిరుపతి నుంచి వారు పంపిన ఫొటోలు మొబైల్‌లో చూస్తూ ఆవేదన చెందారు.





రజని మృతదేహం వద్ద విలపిస్తున్న ఆమె భర్త లక్ష్మారెడ్డి

లావణ్య చాలా యాక్టివ్



నేను లావణ్య ఇంటి పక్కనే ఉంటున్నాను. ఆమెతో నాకు చాలా ఏళ్లుగా పరిచయం ఉంది. ఆమె చాలా యాక్టివ్. సరదాగా, అందరితో కలివిడిగా ఉండేది. జయవందన డ్వాక్రా గ్రూపునకు ఆమె అధ్యక్షురాలు. ఎప్పుడూ వైకుంఠ ద్వార దర్శనం చేసుకోలేదు, ఒకసారి వెళ్లాలని ఉందని చెప్పేది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆమె చనిపోయిందని మంగళవారం అర్ధరాత్రి తెలిసింది. చాలా సేపు నేను ఆ విషయాన్ని నమ్మలేకపోయాను. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లి లేని బాధను ఆ పిల్లలు ఎలా తట్టుకుంటారో అని ఆలోచిస్తేనే ఏడుపు వస్తోంది. ఆ వెంకటేశ్వరస్వామి ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలి.

– పప్పీ,
లావణ్య స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ

నర్సీపట్నంలోని పెద్దబొడ్డేపల్లి నివాసి బొడ్డేటి నాయుడు బాబు తీర్థయాత్రకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. ఈ నెల 6న నాయుడు బాబు, అతని భార్య మణికుమారి, నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన కరణం సత్యనారాయణ, అతని భార్య సంతోషి కలిసి వేంకటేశ్వర స్వామి వైకుంఠ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో నాయుడు బాబు మరణించాడు. ప్రమాదం నుంచి మణికుమారిని పోలీసులు రక్షించారు.





విషాదంలో నాయుడుబాబు బంధువులు

జీవీఎంసీ 43వ వార్డు, వెంకటేశ్వర కాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య తన ఆడపడుచు, మరో ముగ్గురు మహిళలతో కలిసి ఈ నెల 5న వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతి వెళ్లారు. టోకెన్ల కోసం క్యూలో ఉండగా జరిగిన తొక్కిసలాటలో ఆమె మృతి చెందారు. భర్త సతీష్ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి మరణవార్తను పిల్లలకు ఎలా చెప్పాలో తెలియక సతీష్ తీవ్ర వేదనకు గురవుతున్నారు. లావణ్య కాలనీలో అందరితో కలివిడిగా ఉండేవారని, జయవందన డ్వాక్రా గ్రూపునకు అధ్యక్షురాలని స్థానికులు గుర్తు చేసుకున్నారు.



తిరుపతిలో లావణ్య చివరిసారి తీసుకున్న సెల్ఫీ



లావణ్య భర్త సతీష్‌ను ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు,బంధువులు

మంచి స్నేహితులం



నేను, లావణ్య, పప్పీ ముగ్గురం మంచి స్నేహితులం. లావణ్య చనిపోయిందని తెలిశాక నాకు కాళ్లు చేతులు ఆడలేదు. అందరికీ సహాయం చేస్తుంది. ప్రతి నెలా డ్వాక్రా టీఎల్ఎఫ్ మీటింగ్‌లో కలుస్తుంటాం. కష్ట సుఖాలు మాట్లాడుకునేవాళ్లం. ఈ నెల 26న జరిగిన మీటింగ్‌లో కలిశాం. అప్పుడే తిరుపతి వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్తున్నామని చెప్పింది. దేవుడి సన్నిధిలో ఇలా జరగడం చాలా బాధ అనిపించింది. నిన్నటి వరకు మాతో కలిసి ఉన్న లావణ్య ఇప్పుడు లేదంటే మనసుకు కష్టంగా ఉంది.

– సీహెచ్ రమ,
స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే..

- తిరుమల ఘటన టీటీడీ చరిత్రలో బ్లాక్ డే
- వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో ప్రభుత్వం, టీటీడీ విఫలమైంది
- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: శ్రీవారి వైకుంఠ దర్శన టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. ఈ ఘటన టీటీడీ చరిత్రలో ఒక బ్లాక్‌డేగా నిలిచిపోతుందన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, కలెక్టర్, ఎస్పీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారిలో నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారేనని అమర్‌నాథ్ తెలిపారు. టీటీడీ చైర్మన్ వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నాయని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు తరలివస్తారని తెలిసినా, టోకెన్ల జారీలో తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కారణంగానే తొక్కిసలాట జరిగిందన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇంటెలిజెన్స్ విభాగాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. టీటీడీ చరిత్రలో ఏనాడూ ఇలాంటి ఘటనలు జరగలేదని అమర్‌నాథ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారాలు మాని.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున, గాయపడిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. హిందువుల మనోభావాలను గౌరవించి తిరుమల ప్రతిష్టను పెంచేలా వైఎస్ జగన్ వ్యవహరిస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం తిరుమల ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

ప్రధాని పర్యటనతో విశాఖకు ఒరిగిందేమీ లేదు

ప్రధాని పర్యటన పేరుతో కూటమి నాయకులు రోజంతా హడావుడి చేయడం తప్ప, విశాఖకు ఒరిగిందేమీ లేదని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రధానితో ఒక్క ప్రకటన కూడా చేయించలేకపోయారన్నారు. అయోమయంలో ఉన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు కష్టాల గురించి పట్టించుకోకుండా.. వస్తుందో రాదో తెలియని స్టీల్‌ప్లాంట్ గురించి చెప్పడం దారుణమన్నారు. గాజువాక ఎన్నికల ప్రచారంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూటమికి ఓటేస్తే స్టీల్‌ప్లాంట్ అమ్మేసినట్లే అని చెప్పారని, ఇప్పుడు అదే జరుగుతోందని అమర్‌నాథ్ అన్నారు. ప్రధానితో శంకుస్థాపన చేయించిన వాటిలో ఒక్క ప్రాజెక్టయినా చంద్రబాబు సాధించారా? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు కోసం ఏయూ గ్రౌండ్‌లో 2023 మార్చి 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 రాష్ట్రాలతో పోటీ పడి బల్క్ డ్రగ్ పార్క్‌ను సాధించుకొస్తే, ఏపీకి ప్రాజెక్ట్ వద్దని యనమల రామకృష్ణుడితో టీడీపీ కేంద్రానికి లేఖ రాయించడం నిజమా కాదా? అని ప్రశ్నించారు. కృష్ణపట్నంలో ఇండస్ట్రియల్ పార్కు, విశాఖ రైల్వే జోన్.. అన్ని ప్రాజెక్టులు వైఎస్ జగన్ చొరవతో రాష్ట్రానికి వచ్చినవేనన్నారు. టీడీపీ నాయకులు మాత్రం తామే తెచ్చామని భజన మొదలుపెట్టారని.. పనంతా జగన్‌ది అయితే, పబ్లిసిటీ మాత్రం చంద్రబాబుదని విమర్శించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, విశాఖ తూర్పు పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ దిశగా అడుగులు

- ఐదేళ్లలో మేక్ ఇన్ ఇండియా పేరుతో అందుబాటులోకి తీసుకొస్తాం
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

సాక్షి, విశాఖపట్నం: యుద్ధ విమానాల తయారీలో రాణిస్తున్న భారత్.. త్వరలోనే రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారు చేసే దిశగా అడుగులు వేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో రెండు రోజుల పాటు జరుగుతున్న ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ ముగింపు సదస్సులో ఆయన ప్రసంగించారు. వచ్చే ఐదేళ్లలో మేక్ ఇన్ ఇండియా పేరుతో పౌర విమానం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని.. ఆ దిశగా పరిశోధనలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. కేవలం ప్రయాణికుల సౌకర్యాలకే కాకుండా.. విమానాల తయారీలోనూ భారత్ తన సత్తా చాటే రోజులు సమీపంలోనే ఉన్నాయన్నారు. ఒక్క సంస్థ విమానాల తయారీకి ముందుకొచ్చినా.. ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలో డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రమోట్ చేస్తున్నామని తెలిపారు. విశాఖకు బహుళజాతి సంస్థలు వచ్చి పెట్టుబడులు పెడితే.. హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చెందుతుందన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తరఫున డ్రోన్ టెక్నాలజీ, ఏవియేషన్‌కు ప్రాధాన్యమిస్తున్న ఏపీకి సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు, మెడ్‌టెక్‌జోన్ సీఈవో జితేంద్రశర్మ, ఎస్‌టీపీఐ వైజాగ్ చాప్టర్ ప్రతినిధి సురేష్ బాత్ర పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలి

సీఐటీయూ డిమాండ్

మధురవాడ : విశాఖ ఐటీ సెజ్‌లోని మధురవాడ హిల్ నంబర్–2లో గల కూటమి నేత పల్సస్ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, మధురవాడ జోన్ సీఐటీయూ నాయకుడు డి.అప్పలరాజు పేర్కొన్నారు. ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖను ఆర్థిక రాజధాని చేస్తామని ప్రకటనలు చేస్తూ.. మరో వైపు ఐటీ పరిశ్రమలో ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడం ప్రభుత్వాల డొల్లతనానికి నిదర్శనమన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని యాజమాన్యంతో జీతాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐటీ ఉద్యోగులకు మద్దతుగా మిగతా ఉద్యోగులు, కార్మికులను కూడగట్టి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఐటీ ఉద్యోగుల పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందని, వారికి అండగా ఉంటామని తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనానికి వేళాయె..

- నేటి ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు దర్శనాలు
- ముస్తాబైన సింహగిరి, విశేషంగా ఏర్పాట్లు


సింహాచలం : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ఉత్తర రాజగోపురంలో శుక్రవారం ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు స్వామి వైకుంఠనారాయణుడిగా శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమివ్వనున్నాడు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని అంచనా వేశారు. ఉచిత దర్శనం క్యూతోపాటు రూ.100, రూ.300 దర్శన క్యూలు, రూ.500 ప్రత్యేక దర్శన క్యూ, ప్రోటోకాల్ వీఐపీల క్యూ ఏర్పాటు చేశారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా భక్తులు క్యూల్లో నడుస్తూనే 15 నిమిషాలపాటు స్వామిని దర్శించుకునే ఏర్పాటు చేశారు. అలాగే ఉత్తరద్వారం దర్శనం కాగానే నేరుగా ఆలయంలోకి వెళ్లి నీలాద్రిగుమ్మం నుంచి మూలవిరాట్ దర్శనం చేసుకునేలా క్యూలు రూపొందించారు. ఆలయ రాజగోపురం, ఉత్తర రాజగోపురం, ఆలయ ప్రాంగణాలకు విద్యుద్దీప కాంతులు చేకూర్చారు. భారీ ఎత్తున పుష్పాలంకరణ చేశారు. ఉదయం 4 గంటల నుంచి సింహగిరికి ఆర్టీసీ, దేవస్థానం బస్సులు ప్రారంభమవుతాయి. సుమారు లక్ష లడ్డూల ప్రసాదాన్ని విక్రయానికి సిద్ధం చేశారు.

నేటి నుంచి రాత్రి 7 గంటల వరకే దర్శనాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు శుక్రవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే లభిస్తాయని అధికారులు తెలిపారు. ఆలయంలో జరిగే రాపత్తు ఉత్సవాల సందర్భంగా ఈ మార్పు చేశారు.

దర్శన వివరాలు

ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు ఉత్తరద్వారం దర్శనం ముగిసినా.. మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మూలవిరాట్ దర్శనాలు ఉంటాయి.



ముస్తాబైన ఉత్తర రాజగోపురం

నేడూ రూ.500 ప్రత్యేక టికెట్ల విక్రయాలు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం రూ.500 ప్రత్యేక టికెట్లను శుక్రవారం ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు విక్రయించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

భారీ బందోబస్తు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని 229 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తారు. ముగ్గురు ఏసీపీలు, తొమ్మిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 34 మంది ఏఎస్ఐలు, 91మంది కానిస్టేబుళ్లు, 29మంది మహిళా కానిస్టేబుళ్లు, 39మంది హోమ్‌గార్డులతో బందోబస్తులో పాల్గొంటారు. నాలుగు రోప్‌పార్టీలు ఏర్పాటు చేశారు. చేస్తున్నట్టు తెలిపారు. అలాగే బందోబస్తు నిమిత్తం గురువారం సాయంత్రానికే సింహగిరికి పోలీసులు చేరుకున్నారు. కొండపైన వాహనాల రద్దీ నెలకుంటే కొండ దిగువనే వెహికల్స్‌ని నిలుపుదల చేస్తామని సీఐలు గొలగాని అప్పారావు, శ్రీనివాసరావు తెలిపారు.



క్యూలైన్లు ఇలా

- ఉచిత దర్శనం 15వేల రన్నింగ్ ఫీట్ – 10 వేలు మంది సామర్థ్యం
- రూ.100 దర్శనం 14 వేల రన్నింగ్‌ఫీట్ – 9,300 మంది సామర్థ్యం
- రూ. 300 దర్శనం 6 వేల రన్నింగ్ ఫీట్ – 4,100మంది సామర్థ్యం
- రూ.500 దర్శనం 2100 రన్నింగ్ ఫీట్ – 1,450 మంది సామర్థ్యం
- వీఐపీలు, దాతలకు 1500 రన్నింగ్ ఫీట్ – 400 మంది సామర్థ్యం

నేటి నుంచి సదరం తనిఖీలు

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల పథకం కింద నెలకు రూ.15 వేలు పింఛన్లు తీసుకుంటున్న వారి ఇళ్లకు పలు శాఖల అధికారుల బృందం వెళ్లి తనిఖీలు నిర్వహించేందుకు శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలో సదరం సర్టిఫికెట్ల ద్వారా నూరుశాతంతో 319 మంది ఈ పింఛను పొందుతున్న సంగతి తెలిసిందే. దీర్ఘకాలిక వ్యాధులు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచం పట్టిన క్షతగాత్రులు, మానసిక వ్యాధులతో మంచం పట్టిన బాధితులు కూడా ఇందులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మూడు బృందాలు వెళ్లి విచారణ చేయనున్నాయి. భీమిలి సిటీ పరిధిలో డీఆర్‌డీఏ ఏపీడీ దొర ఆధ్వర్యంలో 16 ఇళ్లకు, మధురవాడ జోన్ పరిధిలో డీఆర్‌డీఏ ఏపీడీ వై.శ్రీరామ్ ఆధ్వర్యంలో 16 ఇళ్లకు, ఆశీలమెట్ట జోన్ పరిధిలో 17 ఇళ్లకు బృందం వెళ్లనుంది. డీఆర్‌డీఏ ఏపీడీలతో పాటు ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, ఇతర స్పెషలిస్టులతో కూడిన వైద్య బృందం, వీరితో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎం, ఆశ, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఈ తనిఖీల్లో పాల్గొంటారు. 18, 20, 21, 24 తేదీల్లోను ఈ బృందాలు పర్యటిస్తాయి. అనర్హులుంటే వారి వివరాలను సంబంధిత వైద్యాధికారులు తక్షణమే యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.

నేడు పట్టణ ప్రణాళిక విభాగ వినతుల స్వీకరణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం నిర్వహించే పట్టణ ప్రణాళిక విభాగంలో నగర పౌరుల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు కమిషనర్ సంపత్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, వినతులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్వీకరించనున్నారని తెలిపారు.



లక్షణాలు ఇలా..

ఊపిరి ఆడకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి తదితర సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఈ వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీసే అవకాశం ఉంది. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు బయట పడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది.



హెచ్‌ఎంపీవీపై అప్రమత్తం

కేజీహెచ్, విమ్స్‌లో పడకలు సిద్ధం • మందులు, ఆక్సిజన్ సిలిండర్లు రెడీ • వైరస్‌పై ఆందోళన వద్దు : వైద్యులు


సాధారణ జలుబు వంటిదే..

హెచ్‌ఎంపీవీ సాధారణంగా వచ్చే జలుబు లాంటిదే. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. ముందస్తు చర్యల్లో భాగంగా విమ్స్‌లో 20 పడకల వార్డును సిద్ధం చేశాం. మందులు అందుబాటులో ఉంచాం. కోవిడ్ పట్ల తీసుకున్నట్లుగానే ఈ వైరస్ విషయంలో నివారణకు జాగ్రత్తలు పాటించడం మంచిది. పిల్లలు, వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలి.
– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

మహారాణిపేట/ఆరిలోవ: జనాల్లో ఒక్కటే భయం. ఏదో వైరస్ వస్తోంది. కరోనా కంటే డేంజర్ అన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఈ ప్రచారం చాప కింద నీరులా విస్తరిస్తోంది. గుజరాత్, కర్ణాటకలో కూడా కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు అనేక ప్రాంతాల్లో ఈ వైరస్ విస్తరిస్తోంది. అప్రమత్తంగా ఉండాలన్న ప్రచారం తెర మీదకు వచ్చింది.

హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వైరస్‌తో పాటు శ్వాస కోశ వ్యాధులు విజృంభిస్తున్న వార్తలతో భారత్ ఇప్పటికే అప్రమత్తమైంది. దేశంలో కలకలం సృష్టిస్తున్న ఈ వైరస్ వివిధ ప్రాంతాలకు విస్తరిస్తోంది. శ్వాస కోస సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ వైరస్ సోకుతోందంటున్న దీనిపై ఆందోళన అవసరం లేదని ఇటు ప్రభుత్వం, అటు వైద్యులు భరోసా ఇస్తున్నారు.

దేశంలో ఈ వైరస్ సోకిన ఇద్దరు, వారి కుటుంబాలు ఎలాంటి విదేశీ ప్రయాణాలు కూడా చేయలేదని తెలిపింది. శీతాకాలంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగానే చైనాలో పలు రకాల వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయి. అన్ని వయస్సుల వారిని కూడా ఈ వైరస్ ప్రభావితం చేస్తుంది. ఎక్కువగా 60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారుల మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇది శ్వాస కోశ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే వైరస్. దీనికి సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి.



విమ్స్‌లో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంపీవీ ప్రత్యేక వార్డు



కేజీహెచ్, విమ్స్‌లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు..

జిల్లా యంత్రాంగం ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కేజీహెచ్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డు, విమ్స్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేశారు. ఈ రోగులకు అవసరమైన మందులు, ఆక్సిజన్ సిలిండర్లను రెడీ చేశారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

కరోనా మహమ్మారి మాదిరిగానే హెచ్‌ఎంపీవీ వ్యాప్తి చెందుతోంది. తుమ్ములు, దగ్గు వల్ల వెలువడే తుంపర్ల నుంచి వైరస్ ఇతరులకు సులభంగా వ్యాప్తి చెందుతోంది. వైరస్ ఉన్న వారితో సన్నిహితంగా మెలగడం, భౌతిక దూరం పాటించకపోవడం, మాస్క్ ధరించకపోవడం, తరచు చేతులు శుభ్రంగా కడకపోవడం వంటి కారణాల చేత ఈ వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ప్రకారం చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగ నిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీని బారిన పడే అవకాశాలు ఎక్కువ అని వైద్యులు చెబుతున్నారు.

భయం వద్దు..



ఈ వైరస్‌కు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. సాధారణ జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. మన రాష్ట్రంలో ఒక కేసు కూడా నమోదు కాలేదు. ఈ వైరస్ కొత్తది కాదు. తగు జాగ్రత్తలు తీసుకుంటే చాలు. తరచూ 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులు శుభ్రపరచుకోవాలి. మాస్క్ ధరించాలి. ముక్కు, నోటి ద్వారా వచ్చే తుంపర్లు బయటికి వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ వైరస్ సోకిన వారిలో దగ్గు, జ్వరం, జలుబు, దురద, ఆయాసం వంటి లక్షణాలు కనబడతాయి. 5–6 సంవత్సరాల లోపు పిల్లలకు, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, కీళ్ల వ్యాధులు గల వారిలో, వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ఈ వైరస్ సోకే అవకాశం ఉంది.
–డాక్టర్ జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

వదంతులు నమ్మవద్దు



ఈ వైరస్‌పై వస్తున్న వదంతులు నమ్మవద్దు. ఇది ప్రాణాంతకం కాదు. సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయి. కేజీహెచ్‌లో పలువురు వైద్యుల సమన్వయంతో ప్రత్యేక వార్డు నడుస్తోంది. అందువల్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. రోగులకు ఎలాంటి ఇబ్బంది లేదు.
–డాక్టర్ పి.శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

వాహన త్రైమాసిక పన్ను సకాలంలో చెల్లించండి

ఉప రవాణా కమిషనర్ ఆదినారాయణ

గోపాలపట్నం: వాహన యజమానులందరూ తమ వాహనాలకు సంబంధించిన త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ ఆదినారాయణ ఓ ప్రకటనలో కోరారు. పన్ను చెల్లింపును సులభతరం చేయడానికి, ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సౌకర్యం అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో వాహనానికి సంబంధించిన మండల మ్యాపింగ్, ఈ–కేవైసీ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన మోటారు వాహన కేసుల బకాయిలు ఉంటే, వాటిని కూడా ఆయా రాష్ట్రాల్లో వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించని పక్షంలో ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపు సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా, ముందస్తుగానే పన్ను చెల్లించాలన్నారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చని, దీని వల్ల వాహన యజమానులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

గంజాయి రవాణా కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరు రూ.10 వేల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని వెల్లడించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాద్ రావు అందించిన వివరాలివీ.. నిందితుడు కుక్కల శీను ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్‌లో నివాసం ఉంటున్నాడు. 2018 డిసెంబర్ 7న సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో శీను ఆరిలోవ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దగ్గర ఒక వాహనంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి, అతనిపై నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయి


ఎంఎస్‌ఎస్, పీవోడబ్ల్యూ ప్రతినిధుల ర్యాలీ


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రతినిధులు

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకుడు జేవీ చలపతిరావు

తాటిచెట్లపాలెం: ఎన్నడూ లేని విధంగా దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయని, ఈ కారణంగా అన్ని వర్గాల వారు సమానత్వం కోసం ఉద్యమాలు చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు జేవీ చలపతిరావు తెలిపారు. గురువారం ఉదయం రైల్వే న్యూకాలనీలో గల సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం, పీవోడబ్ల్యూ సంయుక్తంగా ఏర్పాటుచేసిన విశాఖ నివాసుల పోరాట దినం సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో ఎన్నడూ లేని విధంగా దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీ వర్గాలే వీటికి కారణమని తెలిపారు. 2012 నాటికి ఏ సమస్యలు ఉన్నాయో నేటికీ అవే సమస్యలు ఉన్నాయని, సమరశీల పోరాటాల వలన నేడు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలేకపోయారని తెలిపారు. ప్రజలకు సంబంధం లేకుండా పెట్టుబడి దారుల కోసం పాలకులు చేస్తున్న అభివృద్ధి విధ్వంసకరమైనదన్నారు. ఒకనాడు ఫ్యాక్టరీ వస్తే అది అందరి కోసం అనుకునే వారని, నేడు ఫ్యాక్టరీలు వస్తే ప్రజల వినాశనానికి అన్న విధంగా తయారైందన్నారు. మానవ హక్కులను హరించే ప్రధాని నరేంద్ర మోదీ నిత్యం బ్రహ్మణిజాన్ని పోషిస్తూ కుల వ్యవస్థని ప్రోత్సాహిస్తున్నారన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఫార్మసిటీని ప్రోత్సహిస్తూ చంద్రబాబు విధ్వంసకర అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారన్నారు.

కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక నాయకులు బాలన్ మాట్లాడుతూ సనాతన కార్పొరేట్ ఫాసిజం బీజేపీ పాలనలో పెరిగిపోతుందన్నారని పేర్కొన్నారు. బ్యాంకుల్లో నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తానని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీలిచ్చి నేడు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు మోదీ కట్టబెడుతున్నారని తెలిపారు. ఫలితంగా అదానీ, అంబానీల ఆస్తులు లక్షల కోట్లు పెరిగాయన్నారు. సదస్సులో పాల్గొన్న రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి మాట్లాడుతూ పేదలను మరింత పేదలుగా చేయడమే పాలకుల లక్ష్యం అని తెలిపారు. ఆనాడు విశాఖలో నివాస హక్కుల ఉద్యమంలో 90 మందిని అరెస్టు చేసి, రెండు వందల మందిపై కేసులు పెట్టిన మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు నేడు ఎమ్మెల్యే అయ్యారని తెలిపారు. సదస్సు అనంతరం రైల్వే న్యూకాలనీ నుండి ర్యాలీగా వెళ్లి జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

విశాఖ, ఉత్తరాంధ్రకు ప్రధాని మోదీ ద్రోహం



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం చేసి.. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దాసోహమయ్యారని వామపక్ష నేతలు గురువారం జగదాంబ జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, సొంత ముడి ఇనుప గనులు కేటాయింపుపై ప్రధాని మోదీ ప్రకటన చేయకపోవడం విశాఖకు, ఉత్తరాంధ్రకు మరోసారి ద్రోహం చేయడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌కి అవసరమైన ముడి ఇనుప గనుల సరఫరా, ఇతర అనుమతుల గురించి సాగిలపడి మాట్లాడడం దారుణమన్నారు. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై ప్రధాని స్పందించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. విభజన చట్టప్రకారం రావాల్సిన విశాఖ మెట్రో రైలుపై కూడా మాట్లాడలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజీల సంగతి పూర్తిగా మరిచారన్నారు. పక్కనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీటి గురించి కనీసం అడగకపోవడం సిగ్గుచేటన్నారు. ఆందోళనలో సీపీఎం నాయకులు బి.గంగారావు, జగన్, మణి, సత్యవతి, సీపీఐ నాయకులు మరుపిల్ల పైడిరాజు, జేడీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ పుణ్యమా.. మొక్కలకు గండం


ఫెన్సింగ్ తొలగించిన దృశ్యం

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభ పుణ్యమా అని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఇటీవల నాటిన మొక్కలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సభ ఏర్పాట్లలో భాగంగా మొక్కల సంరక్షణ కోసం వేసిన ఫెన్సింగ్‌ను కూటమి నేతలు దగ్గరుండి తొలగించేశారు. 'అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరూ ఓ మొక్క నాటాలని' ప్రధాని మంత్రి పిలుపులో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు పెంపకానికి వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా గ్రౌండ్‌లో రోడ్డు వైపు మొక్కలు నాటారు. అటవీ శాఖతో పాటు, నగరంలోని పలు సంస్థలు మొక్కలు ఉచితంగా సరఫరా చేయగా, వీటిని నాటేందుకని వర్సిటీ బ్యూటిఫికేషన్ విభాగం ద్వారా రూ. 2.10 లక్షలు వెచ్చించారు. వీటి సంరక్షణకు ఫెన్సింగ్, నీటి సరఫరా, ట్యాంకుల కోసం సుమారుగా రూ.35 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేశారు. గొప్ప ఆశయంతో మొక్కలు నాటామని వర్సిటీ అధికారులు చెబుతుండగా, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం నాటి ప్రధాని సభ కోసమని చేసిన ఏర్పాట్లతో రోడ్డు వైపున ఫెన్సింగ్ తొలగించారు. మొక్కలు నాటిన ప్రదేశంలోనే సభకు వినియోగించిన సామగ్రి పెట్టారు. పార్టీ జెండాలను సైతం మొక్కల్లోనే వదిలేసిపోయారు. సభలు, సమావేశాల పేరిట గ్రౌండ్‌ను ఇస్తున్న వర్సిటీ అధికారులు, మొక్కల సంరక్షణ విషయాన్ని మరిచిపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సభ తరువాత ఇక్కడి దృశ్యాలను చూసిన విద్యార్థులు, అటుగా వెళ్తున్న నగర వాసులు సారూ... ఇదేం తీరు అంటూ ప్రశ్నిస్తున్నారు.


మొక్కలు నాటిన ప్రదేశంలో సామగ్రి

ఏపీఐఐసీ భూసేకరణ అధికారిగా అనిత

మహారాణిపేట: ఏపీఐఐసీ భూసేకరణ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి.అనిత నియమించారు. విజయనగరం డీఆర్‌వోగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 20న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయన్నారు. మైనార్టీ విద్యా సంస్థలకు ఈ నెల 11 నుంచి 15 వరకు సెలవులు ఉంటాయన్నారు.

18న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశాలకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

ఎస్‌డీపీ నిధుల విడుదల

మహారాణిపేట: స్పెషల్ డెవలప్‌మెంట్ ప్యాకేజీ(ఎస్‌డీపీ) కింద జిల్లాకు రూ.49.62 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లాలో చేపట్టిన నాలుగు అభివృద్ధి పనులకు ఈ నిధులు విడుదల చేశారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యుఘోష


ఆలివ్ రిడ్లే తాబేలుకు నమస్కరిస్తున్న మహిళ


తీరంలో మృత్యువాత పడిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఏయూక్యాంపస్: విశాఖ తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యుఘోష కొనసాగుతోంది. తాము పుట్టిన ప్రదేశానికి వచ్చి గుడ్లు పెట్టడం ఆలివ్ రిడ్లే తాబేళ్లకు అలవాటు. ఈ క్రమంలో తీరానికి వచ్చే సమయంలో బోట్లకు తగిలి, వలలో చిక్కుకుని తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. నిత్యం విశాఖ సముద్ర తీరంలో ఏదో ఒక ప్రాంతంలో ఇవి దర్శనమిస్తున్నాయి. గురువారం కోస్టల్ బ్యాటరీ వద్ద సుమారు పదికి పైగా ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు దర్శనమిచ్చాయి. ఈ చిత్రాలు వాటి మనగడకు ఎదురవుతున్న ముప్పును ప్రస్ఫుటం చేస్తున్నాయి. అరుదైన, అంతరించే జాబితాలో ఉన్న ఆలివ్ రిడ్లేలను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వలలో పడే తాబేళ్లు సురక్షితంగా బయటికి వచ్చే విధంగా సీఐఎఫ్‌టీ ప్రత్యేకంగా ట్రెడ్‌ను అభివృద్ధి చేసింది. ఈ వలలతో సముద్రంలో మత్స్యకారులు వేట సాగిస్తే ఆలివ్ రిడ్లే తాబేళ్లు సులభంగా బయట పడతాయి. వలల్లో చిక్కుకుని, బోట్లకు గుద్దుకుని భారీ కాయం కలిగిన ఈ తాబేళ్లు మరణిస్తున్నాయి. ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో తాబేళ్లు మరణిస్తున్నాయి. గుడ్లు పొదిగి బయటికి వచ్చిన తాబేళ్లు అనేక సవాళ్లను ఎదుర్కొని సముద్రంలో తమ ఉనికిని చాటుతాయి. తిరిగి గుడ్లు పెట్టడానికి తాము పుట్టిన తీరానికి ఇవి వస్తాయి. రాత్రి వేళల్లో తీరంలో ఇవి గుడ్లు పెట్టి వెంటనే సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఈ క్రమంలో ఇవి తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

రంజీల్లో నితీష్


జీపులో ఊరేగింపుగా వస్తున్న నితీష్ కుమార్

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత రంజీ సీజన్ లీగ్ మలి దశ పోటీల్లో నితీష్ కుమార్ ఆడనున్నాడు. ఈ లీగ్ తొలి దశ పోటీల్లో ఓ మ్యాచ్ ఆడిన నితీష్ ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికై వెళ్లాడు. ఈ దేశవాళీ నాలుగురోజుల టెస్ట్ ఫార్మెట్‌లో తిరిగి ఆంధ్ర ఆరో రౌండ్‌లో పుదుచ్చేరితో తలపడనుండగా... చివరి మ్యాచ్‌లో రాజస్థాన్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ ఆంధ్ర తరపున నితీష్ ఆడనున్నాడు. ఈ మ్యాచ్‌లు ఈనెల 23నుంచి జరగనున్నాయి. ఎలైట్ బీ గ్రూప్‌లో ఆంధ్ర ఇప్పటికే ఐదు మ్యాచ్‌లాడి మూడు మ్యాచ్‌లు ఓడిపోయి రెండు మ్యాచ్‌లు డ్రా కావడంతో నాలుగుపాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో నితీష్ ఆడనుండటంతో జట్టుకు మిడిలార్డర్‌లో కీలకంగా మారనున్నాడు. గుజరాత్‌తో ఆడిన మ్యాచ్‌లో 29 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన స్థితిలో భరత్‌తో కలిసి ఆరో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు.